ఆలయాలకు ఆర్థిక పరిపుష్టి

- ఖాళీ స్థలాల లీజుకు వేలం
- సత్రాలు, ఆలయాలకు ఆదాయం
- చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



సూర్యారావు పేటలోని రామచంద్రమూర్తి దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలం



బోట్‌క్లబ్‌: దేవదాయశాఖ పరిధిలోని ఉన్న సత్రాలు, ఆలయాల ఆదాయం పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆలయాలు, సత్రాలకు ఉన్న ఖాళీ స్థలాలను 11 ఏళ్ల లీజు ప్రతిపాదికన ఇవ్వడంతో వాటికి ఆర్థిక పరిపుష్టి లభించనుంది. ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేసెయ్యాలని చూస్తున్న నేటి తరుణంలో ఆ ఇబ్బందులు తలెత్తకుండా, ఆయా ఆస్తులపై ఆదాయం సమకూర్చుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నగరంలో దేవదాయశాఖ కార్యాలయం పక్కన ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న ముల్లుకుట్ల అచ్యుతరామయ్య ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు సంబంధించిన ఖాళీస్థలంలో తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు లీజు వేలం నిర్వహించగా 13 దుకాణాలకుగాను నెలకు రూ.రెండు లక్షలు ఆదాయం సమకూరింది. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయానికి వార్ఫురోడ్డులో వెయ్యి గజాల ఖాళీ స్థలం ఉంది. ఇది కూడా 11 ఏళ్ల లీజు వేలంకు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ స్థలం లీజుకు ఇస్తే ఆ ఆలయానికి నెలకు రూ.2 లక్షల వరకూ ఆదాయం వస్తుందని దేవదాయశాఖ అధికారులు అంచనాకు వచ్చారు. లీజు వేలం పూర్తయితే ఆదాయం పెరగడంతో భక్తులకు మెరుగైన సదుపాయాలతో పాటు దేవస్థానం సిబ్బందికి జీతాల సమస్య తీరుతుంది. అలాగే పైడా చలమయ్య శ్రీనివాస కల్యాణ మండపానికి చెందిన స్థలం స్థానిక రామారావుపేటలో ఉంది. ఇటీవల వేలం నిర్వహించగా నెలకు రూ.4 లక్షలు, స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయం పక్కన ఉన్న శ్రీరామ చంద్రమూర్తి దేవస్థానానికి ఎదురుగా 496 గజాల ఖాళీ స్థలానికి వేలం నిర్వహించగా ఏడాదికి రూ.11.52 లక్షలు ఇలా నగరంలో ఎనిమిదికి పైగా ఆలయాలు, సత్రాలకు సంబంధించిన ఖాళీ స్థలాలను దేవదాయశాఖ అధికారులు గుర్తించారు. వీటిని 11 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆయా సత్రాలకు దండిగా ఆదాయం సమకూరనుంది.

ఆదాయం పెంచడమే లక్ష్యం



నిరుపయోగంగా ఉన్న సత్రాలు, ఆలయాల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే నగరంలో ఉన్న అన్ని ఖాళీ స్థలాలను పరిశీలించాం. పత్రికా ప్రకటన అనంతరం దశల వారీగా అన్నింటికీ లీజు వేలం నిర్వహిస్తాం. కొన్ని స్థలాలపై కోర్టు కేసులు ఉన్నాయి. కేసులు పూర్తయిన అనంతరం వాటికి లీజు వేలం నిర్వహిస్తాం.

పులి నారాయమణమూర్తి
జిల్లా దేవదాయశాఖాధికారి

ప్రభుత్వ నిర్ణయం సరైనదే



మా దేవాలయానికి సంబంధించిన స్థలం ఎప్పటి నుండో ఖాళీగా ఉండి పోతుంది. తరచూ ఈ స్థలం కబ్జాకు గురికాకుండా ఉండేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. గత సంవత్సరం లీజు వేలం నిర్వహించగా నెలకు రూ. 96 వేలు ఆదాయం వచ్చింది. దీంతో ఆలయానికి ఆదాయం సమకూరుతుంది. సంవత్సరానికి 11. 52 లక్షల ఆదాయం వస్తుంది.

పైడా రామకృష్ణారావు, ఛైర్మన్,
శ్రీరామచంద్రమూర్తి దేవస్థానం

సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి హాజరై సివిల్స్ పరీక్షకు ఏవిధంగా సన్నద్ధమవ్వాలో వివరించారు. సాధారణ డిగ్రీ విద్యార్థుల సైతం సివిల్స్ సాధించిన వారి వివరాలు తెలియజేసి, లక్ష్యం ఏ విధంగా ఏర్పరచుకోవాలి, వాటి సాధనకు ఏ విధంగా శ్రమించాలో వివరించారు. 2022 సివిల్స్ సర్వీసెస్‌లో బీఏ, బికామ్, బీఎస్సీ విద్యార్థులు టాప్-20లో ఉండటం సంతోషించదగ్గ విషయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌జీఓ మహాసభల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, సంఘం నాయకులు

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ ఎన్‌జీవో సంఘం 21వ రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ మహాసభలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయ సమ్మతమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ, పసుపులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, కేవీఎస్‌వీ ప్రసాద్, సరెళ్ల చంద్రరావు, వై.పద్మమీనాక్షి, నగర అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఆజీద్, ఎ.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ దినోత్సవంపై..

కాకినాడ క్రైం: వచ్చే నెల 10 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తగిన చర్యలు చేపడుతోంది. కార్యక్రమ ప్రచార ప్రణాళికలో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్ రెడ్డి వాల్ పోస్టర్, కరపత్రాలు విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాపౌట్లను బడిలో చేర్పించాలి



గొర్రిపూడిలో బడిమానేసిన విద్యార్థి ఇంటికెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎంఈఓలు

కరప: గ్రామాల్లో నిర్వహించిన సర్వే ప్రకారం డ్రాపౌట్లను గుర్తించి, వారిని బడిలో చేర్పించాలని ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి, ఎంఈఓ-2 పి.సత్యనారాయణ సూచించారు. మండలం గొర్రిపూడిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం ఎంఈఓలు సందర్శించి, డ్రాపౌట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పుణ్యమంతుల రామకృష్ణ, గండి దుర్గాప్రసాద్ బడి మానేసినట్టు గుర్తించి, వారి ఇళ్లకు వెళ్లి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, పాఠశాలలో చేర్పించేందుకు ఒప్పించారు. సదరు విద్యార్థులను హైస్కూలుకు తీసుకెళ్లి, చేర్పించి, వారికి జగనన్న విద్యా కానుక కిట్లను ఎంఈఓలు అందజేశారు. సర్పంచ్ కె.రమాదేవి, కార్యదర్శి పి.శ్రీనివాస్, హెచ్‌ఎం ఎ.రామకృష్ణ, సీఆర్పీ పి.సునీత తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కె.అప్పారావు కూరాడలో పర్యటించి, తల్లిదండ్రులతో సమావేశమై, బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపించి, చదుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఒక విద్యార్థిని పాఠశాలకు తీసుకెళ్లి, చేర్పించారు.

అవయవ దానంపై అవగాహన కల్పించాలి



కరపలో అవయవదానంపై మాట్లాడుతున్న ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు

కరప: ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాధికారులు సంయుక్తంగా అవయవ దానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కె.అప్పారావు పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత మహోత్సవ్‌లో భాగంగా గురువారం ఆయన కూరాడ, వేములవాడ, వలసపాకల తదితర గ్రామాల్లో పర్యటించి, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలను దానం చేయడం ద్వారా మరికొంత మందికి ప్రాణదానం చేయవచ్చని విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలను చైతన్యపరచాలన్నారు. వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ గురించి, వారు ఏ సమయంలో అవయవాలు దానం చేయాలో వివరించారు. ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు కరప, నడకుదురు తదితర గ్రామాల్లో పర్యటించి అవయవదానంపై అవగాహన కల్పించారు. వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ గ్రామ సర్పంచ్‌లు వాసంశెట్టి కొండ, కమిడి మంగాదేవి, వి.రామారావు, సాదే ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

తొండంగి: మండలంలోని దానవాయిపేట పంచాయతీ నర్సిపేట గ్రామానికి చెందిన పోలవరపు నాగమణి గత మే నెలలో విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా రూ.5 లక్షలు మంజూరైంది. కాగా గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు మడదా హేమంత్, పంచాయతీ కార్యదర్శి రాజబాబు మృతురాలి కుమారుడు పోలవరపు అర్జున్‌కు బీమా మంజూరు పత్రాలను అందజేశారు. బీమా నగదు రూ.5 లక్షలు అర్జున్ బ్యాంకు ఖాతాలో జమైనట్టు పంచాయతీ కార్యదర్శి రాజబాబు వివరించారు. గ్రామ సచివాలయ కన్వీనర్ రాయుడు బాల నర్సయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మపాలు అమృతం



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న అధికారులు, నాయకులు

- ఆధునిక పోకడలతో బిడ్డలకు పాలివ్వడం మానొద్దు
- ముర్రుపాలతో మరింత ఆరోగ్యం
- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

కాకినాడ సిటీ: తూరంగి వెలమలపేటలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మపాలు బిడ్డకు అమృతంతో సమానమని, ఆధునిక యుగంలో కొంత మంది తల్లులు తమ పిల్లలకు పాలు పట్టించేందుకు విముఖత చూపుతున్నారని, తల్లిపాల ప్రాముఖ్యాన్ని ప్రతి తల్లీ తెలుసుకోవాలని ఆయన అన్నారు. మహిళలను చైతన్య పరిచే క్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు ఆగస్టు తొలివారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో వై.లక్ష్మి మాట్లాడుతూ పిల్లలు పాలు ఎక్కువగా తాగరనే అపోహతో పాలివ్వకుండా ఉండొద్దన్నారు. పిల్లలకు దంతాలు వచ్చే వరకు పాలివ్వాలని, పాలివ్వకపోవడంతో తల్లులు తరచూ అనారోగ్యానికి గురవుతారన్నారు. బిడ్డ పుట్టిన అరగంటలోపే ముర్రుపాలు పట్టిస్తే మంచిదని, శస్త్ర చికిత్స జరిగిన తర్వాత మెలకువ వచ్చాక పాలు పట్టించాలని గర్భిణులకు సూచించారు. రోజుకు 10 నుంచి 12 సార్లు పాలు పట్టించాలని, పాప ఏడ్చిన ప్రతిసారీ పాలు పట్టించవచ్చన్నారు. బిడ్డ రోజుకు 7 నుంచి 8 సార్లు మూత్రం పోస్తే పాలు బాగా పడుతున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో తూరంగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి సూర్యప్రకాశరరావు, రొంగల వెంకటేశ్వరరావు, తూరంగి పంచాయతీ పరిధిలోని 10 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. ఇదే విధంగా కొవ్వూరు పంచాయతీ పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

కేఈ చిన్నయ్యపాలెంలో కేంద్ర బృందం పర్యటన

కోటనందూరు: మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా గురువారం కేంద్ర బృందం పర్యటించింది. బృంద సభ్యులు ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణలో పంచాయతీ అధికారుల తీరు, వ్యక్తిగత ఆరోగ్యం పరంగా తీసుకునే జాగ్రత్తలు తదితర వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సందర్శించి గ్రీన్ అంబాసిడార్లతో మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెరైన్ సీఐగా రామ్మోహన్‌రెడ్డి



మెరైన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్‌రెడ్డి

కాకినాడ క్రైం: కాకినాడ మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐగా టి.రామ్మోహన్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ పోర్టు సీఐగా పనిచేస్తూ రామ్మోహన్ రెడ్డి మెరైన్ సీఐగా బదిలీ కాగా, ఆ స్థానంలో పనిచేస్తున్న సుమంత్ కాకినాడ పోర్టు సీఐగా కొద్ది రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

హీరో సాయిధర్మతేజ్ సందడి



ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతున్న హీరో సాయిధర్మతేజ్

కాకినాడ కల్చరల్: సినీ హీరో సాయిధర్మతేజ్ గురువారం సాయంత్రం సందడి చేసారు. బ్రో సినిమా విజయోత్సవంలో భాగంగా స్థానిక ఆనంద్ సినిమాస్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. మ్యాట్నీ సమయంలో తెర వద్ద ఏర్పాటు చేసిన స్టేజ్ నుంచి ప్రేక్షకులకు అభివాదం చేశారు. ప్రతి ఒక్కరూ ప్రయాణంలో హెల్మెట్ ధరించాలనీ అభిమానులకు, ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు.

బాలింతల ఆరోగ్యానికి భరోసా



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గోడి వెంకట్

బోట్‌క్లబ్‌: బాలింతల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తుందని 41వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోడి వెంకట్ అన్నారు. గురువారం గాంధీనగర్‌లోని 163వ అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను ఆయన లబ్ధిదారులకు అందించారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సంపూర్ణ పోషణ కిట్లను ఇంటికే రేషన్ ఇచ్చేలా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు.

క్లుప్తంగా

సకాలంలో ఓటర్ల సర్వే పూర్తిచేయాలి



కరపలో ఓటర్ల సర్వేపై సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కరప: మండల పరిధిలో చేపట్టిన ఓటర్ల సర్వే పారదర్శకంగా, సకాలంలో పూర్తి చేయాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం వీఆర్వోలు, బీఎల్‌ఓలతో ఆయన సమావేశమై ఓటర్ల సర్వేపై సమీక్షించి పలు సూచనలిచ్చారు. విమర్శలకు తావు లేకుండా సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలని అన్నారు. మండల పరిధి 66 పోలింగ్ స్టేషన్లలో 62,066 మంది ఓటర్లు ఉండగా, ఇంత వరకూ 30,755 మంది ఓటర్లను సర్వే చేసినట్టు తహసీల్దార్ తెలిపారు. ఫారమ్ 6, 7, 8 ద్వారా 1073 మంది ఓటర్లను సవరించినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు వివరించారు. డీటీ కె.అనిల్‌కుమార్, ఎంఎస్‌ఓ పి.శ్రీనివాస్, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఆర్‌ఐ పేపకాయల మాచర్రావు పాల్గొన్నారు.

17 నుంచి సీపీఐ బస్సు యాత్ర



సీపీఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నాయకులు

కాకినాడ సిటీ: దేశంలో ప్రజాస్వామ్యం మాయమైందని మానవ హక్కులు హరించబడ్డాయని, దళితులు ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ విమర్శించారు. గురువారం కాకినాడ గాంధీభవన్‌లో రెండు రోజుల పాటు సీపీఐ శాఖ కార్యదర్శుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దాడులను నిరసిస్తూ ఈనెల 17 నుంచి 27 వరకు పది రోజుల పాటు బస్సు యాత్ర జరుగుతుందన్నారు. ముందుగా పార్టీ పతాకాన్ని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు ఆవిష్కరించారు. 17న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నుంచి సిపిఐ బస్ యాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. జిల్లా నాయకులు బోడకొండ, తోకల ప్రసాద్, పి సత్యనారాయణ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు శ్లాఘనీయం

ఏడీసీ నాగనరసింహారావు



కార్యక్రమంలో పాల్గొన్న ఏడీసీ నాగనరసింహారావు తదితరులు

కాకినాడ: ప్రకృతి వైపరీత్యాలు, ఇతర సందర్భాల్లో రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని నగరపాలక సంస్థ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లాశాఖ ఓఎన్‌జీసీ తోడ్పాటుతో నిర్వహిస్తున్న మూడు రోజుల విపత్తుల నిర్వహణ, ప్రాథమిక చికిత్స శిక్షణ కార్యక్రమాన్ని ఓఎన్‌జీసీ సీజీఎం డి.మాలిక్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వైడీ రామారావుతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏడీసీ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు ఇటువంటి శిక్షణ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఓఎన్‌జీసీ చీఫ్ మేనేజర్ మాలిక్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ తోడ్పాటుతో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ తీర ప్రాంత మండలాల్లో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. ఓఎన్‌జీసీ అధికారులు ఆర్.శంకర్, అన్వర్, రెడ్‌క్రాస్ కార్యదర్శి జె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత్ భారత్ అభియాన్‌పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

బాలాజీచెరువు: ఉన్నత్ భారత్ అభియాన్‌పై ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల యూబీఏ సెల్ నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు పాల్గొని మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కోసం కేంద్ర మానవ వనరుల శాఖ ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని, కళాశాల సమీప గ్రామాల అభివృద్ధి కోసం యూబీఏ సెల్ కృషి చేస్తుందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉన్నత్ భారత్ అభి యాన్ రీజినల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పావని యూబీఏ సెల్ ఆశయాలు, లక్ష్యాలను వివరించారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కళాశాల సమీప గ్రామాలలో సమస్యను విశ్లేషించి పరిష్కారం చూపడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ యూబీఏ నోడల్ ప్రొఫెసర్ జి.నాగరాజా, కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్, ఏవో జీవీకే వర్మ, డైరెక్టర్ కృష్ణంరాజు, యూబీఏ కో-ఆర్డినేటర్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు సాధనకు పోరాడుదాం

కాకినాడ సిటీ: సంక్షేమ బోర్డు సాధనకై భవన నిర్మాణ కార్మికులు పోరాటాలకు సిద్ధపడాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగారావు పిలుపునిచ్చారు. గురువారం కాకినాడ కచేరిపేటలో జిల్లా వర్క్‌షాపులో పాల్గొని మాట్లాడారు. 64 షెడ్యూల్ పరిశ్రమల్లో వేతన సవరణ జరిగి 15 ఏళ్లు గడుస్తోందని, తక్షణమే పరిశ్రమల్లో పని చేసే కార్మికులందరికీ కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు అమలు చేయాలని పేర్కొన్నారు. నాయకులు జి.బేబీరాణి, దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి



కూరాడ హైస్కూలులో వైద్య పరీక్షలపై అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్

కరప: పాఠశాల విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ, వారి ఆరోగ్య పరిరక్షణకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆర్.రమేష్ సూచించారు. మండల పర్యటనలో భాగంగా గురువారం ఆయన వేళంగి పీహెచ్‌సీని సందర్శించి, జాతీయ కార్యక్రమాలు ఎలా అమలు చేస్తున్నదీ పరిశీలించారు. వైద్యులకు, సిబ్బందికి ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. తర్వాత కూరాడ హైస్కూలుకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. విద్యార్థుల్లో హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, రక్తహీనత ఉన్నవారిని గుర్తించి, కోలుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులకు చేస్తున్న వైద్య పరీక్షలను అడిగి తెలుసుకున్నారు. బరువు తక్కువగా ఉన్న వారుంటే పౌష్టికాహారం అందించాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఎ.సింధూర తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా బీపీ, మధుమేహ పరీక్షలు



గురజనాపల్లిలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వైద్యసిబ్బంది

కరప: మండలం గురజనాపల్లిలో గురువారం కాకినాడ స్టార్స్ లయన్స్ క్లబ్, మెడికవర్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మధుమేహం, బీపీపై అవగాహన కల్పించారు. బీపీ, షుగర్‌లను అదుపులో ఉంచుకుంటూ, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్, ఆసుపత్రి సిబ్బంది 150 మందికి ఉచితం బీపీ, షుగరు పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు ఉచితంగా అందజేస్తామని గ్రామస్తుడు, మైత్రి క్లబ్ డీసీ కర్నాసుల శివకుమార్ తెలిపారు. కాకినాడ స్టార్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గరికిపర్తి నమశ్శివాయ, కార్యదర్శి ఇందుగుల ప్రసాదనాయుడు, లయన్స్ క్లబ్ డీసీ పీఎస్ఆర్ మూర్తి, వడ్డాది నాగిని పాల్గొన్నారు.

పుష్కర లిఫ్టుకు మరమ్మతులు చేయాలి

జగ్గంపేట: పుష్కర ఎత్తిపోతల పథకంలోని తాళ్లూరు లిఫ్టుకు అనుసంధానంగా ఉండే రాజపూడి లిఫ్ట్‌కు తక్షణమే మరమ్మతులు చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కోరారు. జగ్గంపేట మండలం రాజపూడిలో పుష్కర ఎత్తిపోతల పథకం లిఫ్టును గురువారం ఆయన పరిశీలించారు. రాజపూడిలోని పుష్కర లిఫ్టు ద్వారా రైతుల పొలాలకు నీరు అందేదన్నారు. ప్రస్తుతం తాళ్లూరు,రాజపూడి లిఫ్టులకు మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయన్నారు.